ప్రజాశక్తి

శుక్రవారం 8 ఆగస్టు 2025

నేడు 'అడవి తల్లి' విగ్రహానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగంగా శుక్రవారం గిరిజన సంఘాల ఆధ్వర్యాన ఐటిడిఎ కార్యాలయ ఆవరణలో గల అడవితల్లి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్ల సురేష్, ఆరిక చంద్ర శేఖర్, ఇంటికొప్పల రామకష్ణ, కోలక గౌరమ్మ, దుక్క సీతారాం లు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రపంచం ఆదివాసీ దినోత్సవం ఆగష్టు 9ముందురోజు అడవితల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ఈ ఏడాది కూడా శుక్రవారం పాలాభిషేకం కార్యక్రమం ఉంటుందని, అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, గిరిజన పెద్దలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

రైతు దరి చేరని తోటపల్లి నీరు

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టుకు సాగునీరందే పరిస్థితి లేదు. గత నెల 16న నీరు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు ప్రకటించినప్పటికీ ఓని, పాలకొండ, రుద్రపేట, వెలగవాడ, బాసురు తదితర ప్రాంతాలకు చుక్కనీరు అందడం లేదు. దీంతో ఈ గ్రామాల రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు జల్లి సుమారు 45 రోజులు కావస్తున్నా నీరందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరందించాలని కోరుతూ ఈనెల 4న ఇరిగేషన్ కార్యాలయం ముందు రైతులు ఆందోళన చేయగా, అధికారులు ఆ మరుసటి రోజే నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ నీరందించలేదు. దీంతో పొలాలు బీటలు వారుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మరికొంత మంది రైతులు ఇంజన్లు పెట్టి నీరు తోడుకుంటున్నారు. ఇరిగేషన్ అధికారులు మాత్రం దీనిపై నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలో 15వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. పాలకొండ మండలం పరిధిలో 7,8 బ్రాంచ్ కాలువల కింద సుమారు 8వేల ఎకరాల సాగవుతుంది. శివారు ప్రాంతం కావడంతో నీరందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ప్రతి ఏటా సాగునీటి కోసం రైతులు ఎదురుచూడాల్సి పరిస్థితి వస్తుంది. దీనికితోడు కాలువలు సరిగ్గా లేకపోవడం, మధుములు మరమ్మతు చేయకపోవడం వంటి సమస్యలతో సాగుభూములకు నీరందే పరిస్థితి లేదు. ఆశించిన స్థాయిలో వర్షాలు కూడా కురవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాలు బీటలు వాళ ..తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తాత్సారం చేయకుండా తక్షణమే సాగునీరందించి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఆందోళనలో రైతన్నలు

పాలకొండ సాగునీరందక ఎండిపోతున్న వరినాట్లు

ఇరిగేషన్ అధికారులు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు

ఇరిగేషన్ అధికారులు కల్లబొల్లి మాటలు చెబుతున్నారు తప్ప శివారు ప్రాంతాలకు నేటికీ నీరందించలేదు. గత నెల 16న నీళ్ల విడుదల చేస్తున్నట్లు ప్రకటన చేసినప్పటికీ చుక్క నీరందలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

కండాపు ప్రసాదరావు, అభ్యుదయ రైతు.

రైతులంటే చిన్నచూపు

రైతులంటే అధికారులకు నాయకులకు చిన్న చూపుగా ఉంది. తమ సమస్యను ఏ అధికారి, నాయకుడు పట్టించుకోవడం లేదు. ప్రతిసారి ఎన్నికల ముందు రైతుల ఓట్ల కోసం తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం, ఆ తర్వాత రైతుల సమస్యల పట్టించుకునే పరిస్థితి లేదు. ఇరిగేషన్ అధికారులు పరిస్థితి కూడా ఇలానే ఉంది. రైతులమంతా ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లేనే నీరు విడుదల చేస్తామని చెప్తున్నారు తప్ప విడుదల చేయడం లేదు.

ఎద్దు బోయిన సింహాద్రి, రైతు

సాధారణ ప్రసవాల్లో జిల్లా ఫస్ట్ : మంత్రి

ప్రజాశక్తి -సాలూరురూరల్

బిడ్డ పుట్టిన గంట లోపు తల్లి పాలు పట్టడం వల్ల బిడ్డ ఆరోగ్యం బాగుంటుందని, తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమైనవి, అనేక పోషకాలతో పాటు విటమిన్లు ఉంటాయని, వీటివల్ల బిడ్డకు వ్యాధుల నుంచి వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బుధవారం సాలూరు కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు శరీరక శ్రమ లేకపోతే బరువు పెరిగి ప్రసవం కష్టమవుతుందన్నారు. రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా నార్మల్ డెలివరీల్లో మొదటి స్థానం ఉన్నామని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ప్రతీ గర్భిణి నార్మల్ డెలివరీ అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే పుట్టిన బిడ్డకు రెండేళ్ల వరకు తల్లి పాలు ఇవ్వాలని సూచించారు. భవిష్యత్తులో బిడ్డకు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు రాకూడదనుకుంటే ప్రతి తల్లి తమ బిడ్డకు పుట్టిన గంటలో పాలివ్వాలన్నారు. ముర్రుపాలను బిడ్డకు తప్పకుండా తాగించాలన్నారు. వీటిలో శక్తివంతమైన యాంటీబాడీలు ఉంటాయని, ఇవి బిడ్డలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయని మంత్రి తెలిపారు. వీటిలో ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తి ఉంటుందని ముర్రుపాలు బిడ్డకు మొదటి వ్యాధినిరోధక టీకాగా పని చేస్తుందన్నారు. తల్లి పాల వల్ల పసికందులో జ్ఞాపకశక్తి పెరుగుతుందని మెదడు చురుకుగా పనిచేస్తుందని పేర్కొన్నారు. అలాగే, ప్రతి బస్ స్టాండ్, ప్రభుత్వ కార్యాలయంలో తల్లిపాలిచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఐసిడిఎస్ ఆర్జెడి జి.చిన్మయదేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టడంలో ఆలస్యం జరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ద్వారా వెల్లడించిందని అన్నారు. ఆసుపత్రుల్లో ప్రసవమైన తల్లులు సుమారు 44.4 శాతం మాత్రమే పుట్టిన గంటలో బిడ్డకు పాలు పట్టడం జరుగుతోందని వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు బిడ్డకు ఔషదమని తెలిపారు. ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి.కనక దుర్గ మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత పెరిగినా తల్లి పాల విశిష్టతను ఎవరూ మర్చిపోకూడదన్నారు. తల్లి పాల నిల్వలకు కాకినాడ, తిరుపతి, అనంతపురంలో బ్యాంక్‌లు కూడా ఉన్నాయని అన్నారు. పాలు రాని తల్లులు అక్కడ నుండి తీసుకువెళ్లి వాళ్ళ బిడ్డలకు పట్టవచ్చని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు మంత్రి చేతుల మీదుగా నిర్వహించారు. విజయ వాహిని సేవా ట్రస్ట్, టాటా ట్రస్ట్ సహకారంతో హెల్దీ బేబీ, ఉత్తమ కుటుంబం పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం మంత్రి తల్లి పాల అవగాహనపై గోడ పత్రిక ఆవిష్కరించారు. సాలూరు అర్బన్ డెంకాన వీధిలో ఉన్న ఐసిడియస్ అర్బన్ సెంటర్ కు మంత్రి చేతుల మీదుగా టీవీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివకుమార్, టాటా ట్రస్ట్ సభ్యులు సుబ్రమణ్యం, సిడిపిఒ విజయగౌరి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ, సాలూరు, మక్కువ, మెంటాడ, పాచిపెంట మండలాల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుల్ల వేణుగోపాల్, వెంకట్రావు, యుగంధర్. కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి, ఐసిడిఎస్ నాయకులు

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారిలో జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభిప్రాయవడ్డారు. ఇందుకు విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మరింత పెరగాలని, అందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని విద్యా శాఖాధికారులకు దిశా నిర్దేశం చేశారు. విద్యా ప్రమాణాలు పెరిగేందుకు చేట్టాల్సిన కార్యక్రమంపై జిల్లా స్థాయి వర్క్ షాపు పాఠశాల విద్య, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణం గా విద్యలో కూడా మార్పులు రావాలని, ఇందుకు ఉపాధ్యాయులకు శిక్షణ అవసరమని అన్నారు. నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా వారిలో జ్ఞానం, నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. విద్యార్థులకు సరైన బోధన లేకుంటే ఒక తరమే పోతుందని, కావున సరైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందని పేర్కొన్నారు. ఉత్తమ బోధన చేసే ఉపాధ్యాయులతో శిక్షణా కార్యక్రమాలు చేపట్టుకోవాలని, అలాగే ప్రతీ సబ్జెక్టుపై శిక్షణ తీసుకోవాలని పేర్కొన్నారు.అవసరమైన ప్రణాళికలు, విద్యా బోధనలో లక్ష్యాలను నిర్దేశించుకొని, అందుకు అనుగుణంగా పనిచేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు తగిన విధంగా ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ఏజన్సీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థులకు బోధించేందుకు భాషా పండిట్లను నియమించాలన్నారు. విద్యతో పాటు పిల్లల ఆరోగ్యం కూడా ముఖ్యమని, ప్రతి పాఠశాలలో హెల్త్ రికార్డులు నిర్వహించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందితో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ తేల్చిచెప్పారు. సమావేశంలో డిఇఒ బి.రాజకుమార్, ఎస్ఎస్ఎ ఎపిసి ఆర్.తేజేశ్వరావు, ఎస్జీటి వనజాక్షి, ఇతర ఎస్జీటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సాగునీరు వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ నుంచి సాగునీటిని వెంటనే విడిచి పెట్టాలని జియ్యమ్మవలస మండల వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం చినమేరంగిలో గల శత్రుచర్ల కోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఏటా ఆగస్టు 3,4 తేదీల్లో సాగునీటిని ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు విడిచి పెట్టే వారిని, నేడు 7వతేదీ అవుతున్నా ఇంతవరకు నీటిని విడిచి పెట్టకపోవడం దారుణమన్నారు. సాగునీటిని విడిచిపెట్టకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నాని ఆందోళన వ్యక్తం చేశారు. నాట్లు పడక ఆకు మడులు ఎండిపోతున్నాయని, వట్టిగెడ్డ రిజర్వాయర్ పరిధిలో ఒక సారి వరి పంట రైతులు పండిస్తున్నారని, అది కూడా ఈ ఏడాది సాగునీరు సకాలంలో అందకపోతే రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని అన్నారు. కుడి ప్రధాన కాలువ ద్వారా 13,324 ఎకరాలకు సాగునీరందాల్సినఉందని ఎడమ కాలువ ద్వారా 3360 ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఇంతవరకు సాగునీరు ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఎందుకు విడిచిపెట్టడం లేదో సమాధానం చెప్పాలని, సాగునీరు విడుదల చేయకపోతే వైసిపి ఆధ్వర్యాన ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నా చేయడానికి సిద్ధపడ్డామని అన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ కోట రమేష్, వైస్ ఎంపీపీ గుడివాడ సంపత్ కుమార్, నాయకులు బలగ వెంకటరమణ, లోలుగు నారాయణరావు, పోల గోవిందరావు, తాడేల మన్మధరావు, బెజ్జిపొరపు మురళి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌గా రత్నకుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా టిటి రత్నకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తన చాంబర్లో బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి కమిషనర్ బివి ప్రసాద్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. మేనేజర్ శివప్రసాద్‌తో సహా అన్ని విభాగాల అధికారులు కమిషనర్ రత్నకుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సరిపడా బస్సులు కొనాలి

- అదనపు సిబ్బంది నియామకాలు చేపట్టాలి
- ఆర్‌టిసి ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి
- ఎపిఎస్‌ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సరిపడినన్ని బస్సులు కొనుగోలు చేయాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జోనల్ అధ్యక్ష , కార్యదర్శులు ఎం సి హెచ్ అప్పడు, వి.రాములు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తుందని, మహిళలకు ఫ్రీ బస్సు పథకం అమలు వేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అయితే అవసరానికి తగిన బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అదనపు సిబ్బంది నియమించాలని డిమాండ్ చేశారు. ఈ ఉచిత బస్సు పథకం వల్ల మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ఆర్టీసీ సిబ్బందిపై పనిభారం కూడా పెరుగుతుందని, పెరుగుతున్న పని భారానికి తగిన విధంగా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలకు ప్రజా రవాణా అత్యంత అవసరమని, ప్రజా రవాణా విస్తృతం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ఆర్టీసీ పరిరక్షణకు ఎస్‌డబ్ల్యూఎఫ్ ఇతర ఆర్టీసీ ఉద్యోగ సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటం నిర్వహిస్తుందని తెలిపారు. ఆర్టీసీ సంస్థకు చెందిన ఆస్తులను, భూములను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికే దశల వారి ఆందోళనలు చేపట్టామని, భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్త ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, పార్వతీపురం డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎస్ రావు, ఏ ఎస్ టి బాబు, కార్యవర్గ సభ్యులు ఎస్ వి రమణ, టి.వెంకటి, బి మోహన్ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ జోనల్ అధ్యక్షులు ఎంసిహెచ్ అప్పడు

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

పోలీస్ సిబ్బంది శాఖాపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వర్చువల్ విధానం (జూమ్) ద్వార "పోలీస్ వెల్ఫేర్ డే" (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి, ఎస్‌డిపిఒ , సర్కిల్ కార్యాలయం, ప్రతీ పోలీస్ స్టేషన్ అధికారులను ఒక్కొక్కరిగా వారి, వారి సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను విన్న ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బందితో సంబంధిత ఫిర్యాదులపై మాట్లాడి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది శాఖా పరంగా విన్నవించుకున్న సమస్యలను, వారి సలహాలను పరిగణలోకి తీసుకొని త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సిఐ రంగనాధం, సైబర్ సెల్ సిఐ శ్రీనివాస రావు, పలువురు సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్‌కమిటీ సభ్యులు కాంతారావు

వాహన తనిఖీల్లో రూ.65 వేలు జరిమానా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా రవాణా శాఖ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించి రూ.65వేల అపరాద రుసుం వసూలు చేశారు. పట్టణంలోని బెలగాం శివారులో స్థానిక వెంకంపేట గోలీ జంక్షన్ వద్ద జిల్లా రవాణా శాఖ అధికారి టి.దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.కాశీరాం నాయక్, పోలీస్, హెూమ్ గార్డ్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలను గురువారం నిర్వహించారు. ఈ తనిఖీల్లో పరిమితికి మించి అధిక ప్రయాణికులతో ప్రయాణించిన ఆటోలు, రహదారి నియమాలను అతిక్రమించిన 22 వివిధ రకాలైన వాహనాలపై పెట్టీ కేసు నమోదు చేసి, 2 ఆటోలను సీజ్ చేస్తూ రూ.65 వేలు అపరాధ రుసుమును వసూలు చేస్తూ, రహదారి ప్రమాదాలు నివారణ, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై పలువురు వాహన డ్రైవర్లకు, పాదచారులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రత నియమాలను పాటించకపోతే వాహన ప్రమాదాలు ఎలా జరుగుతాయో అన్న అంశంపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

176 మందికి కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలో గురువారం నిర్వహించిన కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరంలో 176మంది పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ నాగభూషణరావు ప్రారంభించారు. 65మందికి నోటికి సంబంధించిన కేన్సర్ పరీక్షలు నిర్వహించగా నలుగురు అనుమానితులుగా, ఒకరికి నాలుక కేన్సర్‌గా నిర్ధారించారు. బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించి 91మందికి పరీక్షలు నిర్వహించగా 20మందిని అనుమానితులు గా నిర్ధారించారు. వీరికి డిజిటల్ మెమోగ్రఫీ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎవరికీ కేన్సర్ నిర్ధారణ కాలేదు. మరో 20మందికి గర్భసంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా పదిమందిని అనుమానితులుగా నిర్ధారించారు. వీరికి ప్యాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. వారం రోజుల్లో వీరి రిపోర్టులు రానున్నాయని వైద్యులు తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివనాగజ్యోతి పర్యవేక్షణలో నిర్వహించిన వైద్యశిబిరంలో దంత వైద్యులు డాక్టర్ హారిక, డాక్టర్ కె.పాల్,మెమోగ్రఫీ టెక్నీషియన్స్ లక్ష్మీ, సుమన్, జిల్లా కేంద్ర ఆసుపత్రి దంత వైద్యులు డాక్టర్ దినేష్ కుమార్, డాక్టర్ శ్యామల పాల్గొన్నారు.

కేన్సర్ నిర్ధారణ వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డిసిహెచ్‌ఎస్ నాగభూణరావు

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పాలకొండ, వీరఘట్టం

ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం వీరఘట్టం మండల పరిధిలో రేషన్ డిపోలను, అంగన్వాడి కేంద్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ నిత్యావసర దుకాణాల సరుకుల పంపిణీని తనిఖీలు నిర్వహించారు. అన్ని రేషన్ దుకాణాల్లో తప్పనిసరిగా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టాక్ బోర్డులు లేకపోతే భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాలకొండ పట్టణంలోని రేషన్ డిపోలు, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీలు చేశారు. అనంతరం పాలకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు తీరును పరిశీలించారు. భోజనం నాణ్యతను పరిశీలించి సాంబారులో పప్పు సరైన మోతాదులు లేని కారణంగా నాణ్యత పెంచాలని, లేకపోతే భవిష్యత్తులో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సందర్భంగా రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో ఇప్పటి నుంచే కష్టపడి చదువుకోవాలని, శ్రమ మన ఆయుధమైతే విజయం మన బానిస అవుతుందని, విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, విద్యాశాఖ అధికారి రమా జ్యోతి, తూనికల విభాగం అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, బీసీ వెల్ఫేర్ సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, స్థానిక తహశీల్దార్లు పాల్గొన్నారు.

దశమంతపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ, గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖనం, వక్తత్వం పోటీలను గిరిమిత్ర సమావేశ మందిరంలో గురువారం ఐటిడిఎ అధికారులు నిర్వహించారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పోటీలను పరిశీలించారు. "గిరిజన సంస్కృతి - సంప్రదాయాలు" ఇతివృత్తంగా పోటీలను నిర్వహించారు. వీటిలో గెలుపొందిన విజేతలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఆర్ కష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఐటిడిఎ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా సీతంపేట క్లస్టర్ పాలకొండ నియోజకవర్గం స్థాయి పరిధిలో ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి ఎన్.జాకబ్ దయానంద్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. సీతంపేట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం 21 స్కూళ్లలోని 350 మంది విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఆర్చరీ పోటీలు నిర్వహించారు. డిడి అన్నదొర, ఎపిఒ చినబాబు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులను ఆదివాసీ దినోత్సవం రోజున అందజేశారు.

పాఠశాలను తెరిపించాలని కోరుతున్న గరిసిగుడ్డి గ్రామ గిరిజనులు

పాఠశాలను వెంటనే తెరిపించాలి

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని గరిసిగుడ్డిలో మూసివేసి ఉన్న పాఠశాలను వెంటనే తెరిపించాలని సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామంలోని పాఠశాల వద్ద గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిపిఎస్ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించి మూసి ఉన్న పాఠశాలను తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల ప్రారంభం నుంచి ఉపాధ్యాయుడు రాకపోవడంతో పిల్లలు కొండలు, వాగులు వంకలు వెంబడి తిరుగుతూ పాడైపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు సూకురు పండయ్య, సేవి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరేడువలసలో కార్డాన్ అండ్ సెర్చ్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నేరేడువలసలో స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు గురువారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లను, షాపులను తనిఖీలు నిర్వహించారు. అనంతరం అక్కడ ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాలు, రహదారి భద్రత నియమాలు మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిస అవడం వల్ల కలిగే అనర్థాలు గూర్చి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యసనాలకు దూరంగా ఉండి కుటుంబానికి భరోసాగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో శిలగాంలో సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ వహించారు. ఈ సందర్భంగా నాటుతుపాకీలు ఉంటే స్టేషన్‌కు అప్పగించాలని కోరారు. లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలజీవన్‌మిషన్ పథకంలో భాగంగా నిర్మించిన వాటర్ ట్యాంకులను నాణ్యత లేకుండా పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్దశిఖ గ్రామంలో ఇటీవల కాలంలో ఎమ్మెల్యే ప్రారంభించిన రక్షిత మంచినీటి ట్యాంకును లీకులు రావడంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన 15 రోజులకే నీళ్ల ట్యాంకులు నుంచి నీరు చిమ్మడం దారుణమన్నారు. నీళ్ల ట్యాంకుకు నీరు అందించే మోటర్ కూడా పూర్తిస్థాయిలో నీరు అందించే పరిస్థితి లేదన్నారు. ఎందుకంటే కరెంటు కూడా వస్తూ పోతూ ఉండడం వల్ల నీరు పూర్తిస్థాయిలో రాణి పరిస్థితి ఉందని వెంటనే సెపరేట్‌గా ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో ఇంటింటి ప్రైపులకు నీరు కూడా పూర్తిస్థాయిలో అందని పరిస్థితి ఉందని కాబట్టి వెంటనే ప్రతి ఇంటికి మీరు పూర్తిస్థాయిలో అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

సమాచార హక్కు చట్టం పై అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సమాచార హక్కు చట్టంపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు సూచించారు. సిబ్బందికి ఈనెలలో చేయాల్సిన పనులు గూర్చి మండలంలోని తోటపల్లిలో గురువారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ రైతులకు అందుబాటులో ఉండి పంటలకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సమాచార హక్కులు చట్టం గూర్చి అవగాహన కల్పించడం జరిగింది. అలాగే వాటి అవశ్యకత, ప్రయోజనాలు, ప్రాముఖ్యతపై సమగ్రమైన అవగాహన కల్పించారు. సమాచార హక్కులు చట్టం 2005లో ప్రజలకు ప్రభుత్వ శాఖల నుండి సంచారం పొందే హక్కును కల్పించిందని, ఇది పారదర్శకత, నైతికత, జవాబుదారీ తనన్ని ప్రోత్సహించిందని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎలు, ఎంటిలు, ఎఓపిఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురంలో ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

బలిజిపేట: జాతీయ చేనేత దినోత్సవాన్ని మండలంలోని నారాయణపురం లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత వస్త్ర ధారణ వల్ల ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ చేశారు. చేనేత కార్మికులను సన్మానించారు. చేనేత జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి ఎవి.వెంకటరమణ మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రభుత్వం నుంచి వచ్చే సాయాన్ని వివరించారు. ఆగస్టు నుంచి 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ప్రభుత్వం అందించడమే కాకుండా జీఎస్‌టిని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కార్యక్రమంలో డిజైనర్ ప్రసాద్, వెంకటేష్, చేనేత సంఘం మాజీఅధ్యక్షులు చప్పలి నారాయణరావు, కబ్బారు గౌరీశంకరరావు, కొండక అప్పారావు, కాలేపు వీర్రాజు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అర్హత గల కమిషనర్‌ను నియమించాలి

పార్వతీపురం టౌన్: స్థానికమున్సిపాల్టీ అర్హత కలిగిన గ్రేడ్-1 కమిషనర్‌ను నియమించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు నాయకులు వి.దాలినాయుడు, శీఖ గౌరీ శంకరరావు, కోల కిరణ్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ అర్హత లేని వారిని కమిషనర్‌గా నియమించడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కావున ప్రభుత్వం అర్హత కలిగిన వ్యక్తినే మున్సిపల్ కమిషనర్ గా నియమించాలని కోరారు.

బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ

వీరఘట్టం : మండలంలోని కడకెల్ల, నడిమికెల్ల, విక్రంపురం గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమలు కాని హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, సుభిక్ష కార్యక్రమం తోనే అన్నదాతలకు మోసం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అర్హులకే కోత విధిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి, విక్రాంపురం మాజీ సర్పంచ్ మాచర్ల వెంకటరమణ, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి

సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా

ఆదివాసీ దినోత్సవ వేడుకలు

విచిత్ర వేషధారణతో ఆకట్టుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తరతరాల నుంచి వస్తున్న ఆదివాసీల గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ దినోత్సవ వేడుకలను మండలంలోని పి.ఆమిటి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం నిర్వహించారు. గిరిజనుల కళలు, ఆచార వ్యవహారాలు, కట్టు బొట్టు ప్రతిబింబించేలా విద్యార్థుల వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. ఆనాడు ఆదివాసీల హక్కులు, చట్టాల కోసం బ్రిటీష్ వారితో పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, బిరస ముండా, ఆదివాసీ అడవి తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గిరిజనుల హక్కులు, చట్టాలు, సంస్కృతి పరిరక్షణకు ఇటువంటి కార్యక్రమాలు చేస్తూ జాతి గౌరవాన్ని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి కషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.జ్యోతి, పిడి రాజకుమారి తదితరులు ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి రూ.7600 విరాళం

ఈనెల 9న గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు మండలంలోని దొర జమ్ము గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూ. 7600 నగదు విరాళంగా అందించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావుకు హెచ్‌ఎం ఆరిక గోవిందరావు, డిప్యూటీ వార్డెన్ నిమ్మక వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. గిరిజనుల పండుగ ఆదివాసీ దినోత్సవానికి నగదు అందించడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

కొమరాడ : ఈ నెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గిరిజన సంఘం నాయకులు హెచ్ రామారావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ గంగభద్ర గ్రామంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన నాయకులు రామారావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకవైపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకునే విధంగా ప్రచారాలు జరుపుతున్న నేపథ్యంలో వెంటనే ప్రభుత్వం గిరిజన ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. గిరిజనులకు నష్టదాయకమైన చట్టాలను రద్దు చేయాలని, ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఆగస్టు 9న ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు 100శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ ప్రకటించాలని గిరిజన ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐదవ షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన యువకులు మహిళలు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - బలిజిపేట

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని, ట్రూఅప్‌ఛార్జీలను, పెంచిన విద్యుత్‌ఛార్జీల తగ్గించాలని మండలంలోని చిలకలపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, మండల నాయకులు బొద్దాన భానుమూర్తి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని ప్రజలకు హామీ ఇచ్చిన కూటమి పెద్దలు ఇప్పుడు విద్యుత్ చార్జీలను దొడ్డిదారిన పెంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత అవే స్మార్ట్ మీటర్లను ప్రజలకు బలవంతంగా అంటగట్టి వేలాది రూపాయలు భారం ప్రజలపై మోపడం మంచిది సమంజసం కాదన్నారు. మండలంలో ఇప్పటికే సుమారు 760 స్మార్ట్ మీటర్లు పెట్టారని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ట్రూఅప్, కస్టమర్, సర్ ఛార్జీలు రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని, మీటర్లు పెట్టే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పీసా వెంకటస్వామి, నల్ల ఈశ్వరరావు, ఓల సత్యం, నారాయణ రావు, శివ, వెంకటేష్, యమ్మల మన్మథరావుపాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీ పురం

చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ఆదుకోవాలని స్థానిక ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవరం అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ చేనేత వస్త్ర దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేనేత వస్త్రాలు మన భారతీయ ఆచార సంప్రదాయాల్లో భాగమని గాంధీజి లాంటి జాతీయ నాయకులు చేనేత వస్త్ర ధారణను ప్రోత్సహించారని అన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయి శిథిలమైపోతున్న జీవనాన్ని కొనసాగిస్తూ పూట గడవటమే కష్టంగా ఉన్న చేనేత కార్మికులను ఆదుకోవాలంటే మనందరం చేనేత వస్త్రాలను ధరించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు, వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ కల్పనస్వరూప, సభ్యులు తులసి, సత్యా రావు, చిన్నారావు, కృష్ణారావు, జమ్మయ్య పాల్గొన్నారు.

హమ్మయ్యా వర్షం పడింది...

ప్రజాశక్తి - పాలకొండ

కొద్దిరోజులుగా ఎండల వేడికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. రెండో వేసవి తలపించేలా ఇటీవలే ఎండలు ఠారెత్తించాచి. అయితే ఈ వర్షంతో కొంత చల్లబడింది. రైతులు కూడా ఈ వర్షం కురడంతో ఆనందం చెందుతున్నారు.

సామూహిక వంట విధానం రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో అనేక మార్పులు తీసుకొస్తుందని, మండలానికి ఒకచోట వంట నిర్వహించి విద్యార్థులకు పంపిణీ చేసే ఆలోచన చేస్తుందని, దీనివల్ల మధ్యాహ్న భోజన నిర్వహకులకే కాకుండా విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ ఆందోళన వ్యక్తం చేశారు. గరుగుబిల్లిలో గురువారం మధ్యాహ్న భోజన నిర్వహకుల మండల మహాసభ పి.పావని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఈ పథకంలో పనిచేస్తున్న వీరికి వేతనం కేవలం రూ.3వేలే చెల్లించి శ్రమదోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు.. ఇప్పటికైనా నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించి, ఉపాధికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన పథకంలో మెనూ మార్చుతున్న ప్రభుత్వం ఆ మెనూ అమలు చేసేందుకు కృషి చేస్తున్న వంట అమ్మల పట్ల కనీస సానుభూతి ప్రదర్శించడంలేదన్నారు ఇప్పటికైనా మధ్యాహ్న భోజన పథక నిర్వహకుల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో కార్మికులందర్నీ ఐక్యం చేసి పోరాడుతామని హెచ్చరించారు. భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించేందుకు ఈనెల 10న పార్వతీపురంలో జరిగే మధ్యాహ్న భోజన నిర్వహకుల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దాసరి వెంకట నాయుడు, తలిశెట్టి జగ్గారావు, మధ్యాహ్న భోజన నిర్వాహక సంఘం నాయకులు పావని, అన్నపూర్ణమ్మ, మణికుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా పి.పావని, కార్యదర్శిగా బి.మణికుమారి, ఉపాధ్యక్షులుగా ఎస్ సాయమ్మ,ఎం గౌరమ్మ, సహాయ కార్యదర్శులుగా వి.సరళ, టి.పార్వతి, కోశాధికారిగా బి.లక్ష్మితో పాటు ముగ్గుర్ని మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కొత్తగా ఎన్నికైన మండల నూతన కార్యవర్గం

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌బిఎస్‌కె డిపింఒ జగన్మోహన్‌రావు

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆర్.బి.ఎస్.కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన సందర్శించారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలు హెల్త్‌కార్డులో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. డి-వార్మింగ్ కార్యక్రమం సన్నద్ధతపై ఆరా తీశారు. ఆల్బెండజోల్ మాత్రలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీవార్మింగ్ డే సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన పెంపొందించారు. డీవార్మింగ్ డే ఆవశ్యకతపై వివరించారు. నులిపురుగులు నిర్మూలనకు అందరికీ ఆల్బండజోల్ మాత్రలు వేయించాలన్నారు. చేతులు పరిశుభ్రత పాటించాలని చెప్పారు. రక్తహీనతగా గుర్తించిన కిశోర బాలికలకు ప్రతీ రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన ప్రతి కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ కె.కౌశిక్, వైద్యాధికారి డా పిఎల్ గోపాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు గౌరీశ్వరి, సూపర్వైజర్ శంకర్రావు, వైద్య సిబ్బంది, పాద్యాయులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు తల్లి పాలు తాగించాలి

ప్రజాశక్తి -భామిని

నవజాత శిశువు ఆరోగ్య రక్షణలో తల్లిపాలే కీలకమని, కావున ప్రతి తల్లి పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలను తాగించాలని సిడిపిఒ శాంతి భవాని అన్నారు. మండలంలోని బత్తిలి, లోహరి జోల, వడ్డంగి, పాలిష్ కోట, బొడ్డగూడ గ్రామాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జ్యోతిలక్ష్మి, గురిబిల్లి సబిత, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాంలో 'తొలి అడుగు'

ప్రజాశక్తి -కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో టిడిపి నాయకులు గురువారం సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు గూర్చి వివరించి సుపరి పాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు రమణ, సాయి, గంగులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



డి-వార్మింగ్‌పై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొమరాడ ఎంపిడిఒ రమేష్, సిబ్బంది

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఈనెల 12న డివార్మింగ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలతో పాటు 62 ప్రభుత్వ పాఠశాలలు, పది ప్రైవేట్ పాఠశాలలు, 91 అంగన్వాడి కేంద్రాలు, కిషోర్ బాలికలు తప్పనిసరిగా నులి పురుగు మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు, ఎఒ డి.వెంకటరమణ, వైద్యాధికారి సాయికుమార్, సూపర్‌వైజర్లు మూర్తి, శాంతి కుమారి, ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు ఆల్బండజోల్ మాత్రలు వేయించాలని ప్రభుత్వం చేపడుతున్న డివార్మింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు విద్యాశాఖ ఆధ్వర్యంలో డివార్మింగ్ కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డి వార్మింగ్ టాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమరాడ, కెఆర్బిపురం వైద్యులు శిరీష, శామ్యూల్, వెలుగు ఎపిఎం సురేష్ బాబు, పంచాయతీ విస్తరణ అధికారి రాధాకృష్ణ, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో గురువారం డాక్టర్ హేమాక్షి, డాక్టర్ సుశీల ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద హోమియో వైద్య శిబిరాలు నిర్వహించారు. సీజన్లో వచ్చే జ్వరాలకు సంబంధించి వాత నొప్పులు, కీళ్ల వాపులు, దగ్గు, జలుబు, ఆయాసానికి సంబంధించి మందులు పంపిణీ చేశారు. అలాగే వర్షాకాలంలో పాటించాల్సిన ఆహార నియమాలను, పరిసరాల పరిశుభ్రతను వివరించారు. ముఖ్యంగా ఆయుష్ చూర్ణాలు, గుగ్గులు, చిత్రక హరితకి, పునర్నవాసవం మొదలగు మందులు, కీళ్ల నొప్పులకు హెూమియో మందులు మూడు రోజులకు గాను దోసు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది పద్మ, హరిప్రియ, లక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

శక్తి యాప్‌పై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి ఆధ్వర్యంలో గురువారం ఎఎస్ఐ ఎల్.శ్రీనివాస రావు అవగాహన కల్పించారు. ఈ యాప్ మహిళలకు రక్షణ యాప్ అన్నారు. ప్రతి కాలేజీ, స్కూళ్లలో, బహిరంగ ప్రదేశాల్లోనూ, బస్, రైల్వే స్టేషన్లు, మొదలైన ప్రదేశాల్లో ఇవ్‌టీజింగ్ పాల్పడి వారిపై ఫిర్యాదు చేసేందుకు దోహదపడుతుం దన్నారు. మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, ఫోక్సో యాక్ట్ మొదలైన వాటి గురించి అవగాహన కలించారు. కావున ప్రతి విద్యార్థినికి శక్తి యాప్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్, దాని ఉపయోగం, అందులో ఉండే 11 ఫ్యూచర్స్ గురించి వివరిస్తూ అవగాహన కల్పిస్తూ ప్రతి చోటా ధైర్యంగా తమకు ఏ సమస్య వచ్చినా ఈ శక్తి యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 112, అందులో ఫీచర్స్‌ను ఉపయోగించుకొనేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా 'రీడ్స్'

ప్రజాశక్తి - సీతంపేట

ఆదివాసీలకు అండగా రీడ్స్ ఎన్జీవో పనిచేస్తుందని ప్రజాప్రతినిధులు అన్నారు. గురువారం ఓంద్రోజోలలో రీడ్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూటమి నాయకులు ఇమరక పవన్, జడ్పిటిసి ప్రతినిధి సవర రాము రీడ్స్ ఎన్జీవో ఆఫీసును ప్రారంభించారు. అనంతరం స్థానిక సర్పంచ్ ప్రతినిధి సవర చంద్రావు మాట్లాడుతూ మారుమూల గ్రామంలో రీడ్స్ ద్వారా ఆదివాసీలకు సేవ చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. రీడ్స్ ఎన్జీవో డైరెక్టర్ ఎ.గణేష్‌రావు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు పరిరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో జైఆదివాసీ చైర్మన్ కె.గణపతిరావు, డైరెక్టర్ ఎస్.ముక్కు లింగం, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

యాప్‌లపై అవగాహన అవసరం : ఎంపిడిఒ

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధయాప్‌లపై ఉపాధిహామీ సిబ్బందికి అవగాహన ఉండాలని ఎంపిడిఒ శ్రీనివాసరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన అన్ని యాప్‌లపై సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కొత్తగా వస్తున్న యాప్‌లపై ఉపాధి కూలీలకు ఎంఎస్ఎన్ జియో టాకింగ్ ఉండే అంశాలపై అవగాహన కలిగించాలని ఆయన అన్నారు. పనుల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సిబ్బంది శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ బాలకృష్ణ, బలిజిపేట ఎపిఒ కేశవరావు, ఇసిలు నారాయణరావు, ఆదినారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మణరావు, శ్రీదేవితో పాటు సీతానగరం, బలిపేట మండలాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దురిబిలిలో రేషన్ పాయింట్ పెట్టాలి

ప్రజశక్తి - కురుపాం

మండలంలోని బియ్యాలవలస పంచాయతీ దురిబిలి లో రేషన్ పాయింట్ పెట్టాలని గురువారం స్థానిక తహశీల్దార్ కె.జయకు గ్రామ సర్పంచ్ పి.అజారి ఆధ్వర్యంలో గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ తమ గ్రామానికి ఆనుకొని 7గ్రామాలు 236 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరంతా కురుపాం వెళ్లి రేషన్ తెచ్చుకోవడానికి అనేక ఇబ్బందిలు పడుతూ ఆర్థికంగా కూడా నష్టపోతున్నారని అన్నారు. కావున దురిబిలో రేషన్ పాయింట్ ఏర్పాట చేయాలని వారు కోరారు. దీనికి తహశీల్దార్ స్పందించారు. వినతిని అందజేసిన వారిలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని కోట దుర్గ ఆలయం వద్ద గల నాలుగు విద్యుత్తు స్తంభాలు నేల కొరగడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గురువారం ఉదయం రెండు గంటల సమయంలో భయంకరమైన గాలివీయడంతో అక్కడ ఉన్న చెట్టు విద్యుత్తు ప్రధాన వైర్లపై పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్కో సిబ్బంది అక్కడకు చేరుకొని ప్రధాన వైర్లపై ఉన్న చెట్టును తొలగించారు. ఎండల తీవ్రత వల్ల విద్యుత్ సరఫరాకు బ్రేకులు పడడంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాన్స్కో ఎఇ కె.అనిల్ కుమార్ పర్యవేక్షణలో విరిగిన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి అమర్చి విద్యుత్ పునరుద్ధరించడంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు

కుర్చీలు వితరణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఏరియా హాస్పిటల్‌లో రక్త నిల్వ కేంద్రానికి నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు గురువారం కుర్చీలు వితరణంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన క్యాంపులకు వెళ్లేటప్పుడు కుర్చీలకు ఇబ్బందిగా ఉన్నట్లు తన దృష్టికి సిబ్బంది తీసుకొచ్చినట్టు తెలిపారు. దీంతో తన తల్లిదండ్రులకు కుర్చీలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ చిరంజీవి, రక్త నిల్వల వైద్యాధికారి శివశంకర్ తదితరులు ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట సొండి వీధికి చెందిన నల్ల శివకుమార్ (34) గురువారం ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం సీతంపేట సోండి వీధికి చెందిన శివకుమార్ కుటుంబ కలహాలతో కారణంగా తన ఇంటి వద్ద ఉరిపోసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఆయన తండ్రి వెంకట్రావు గురువారం సాయంత్రం ఐదు గంటల సమయములో ఇంటి వద్ద చూడగానే ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుని కొడుకు కనిపించడంతో వెంటనే ఆటోలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే శివకుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి బ్లాక్ రాసూరుకు చెందిన జ్యోతితో గత ఏడాది వివాహమైంది. తండ్రి నూడిల్స్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఒకగానొక్క కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమైన్నీరై రోధిస్తున్నారు. ఎస్ఐ అమ్మన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.